1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 03 సంచిక : 139

బుధవారం 27 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## దేశంలోకి చొరబాట్లు..అక్రమ వలసదారులపై ఉన్నతస్థాయి కమిటీ




(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 26)

అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పులను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గతంలో ప్రధాని మోదీ ప్రకటన ఆధారంగా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు ఒక పెద్ద సవాలుగా మారిందని పేర్కొన్నారు. కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని.. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై సమగ్ర మూల్యాంకనం నిర్వహించడం.. మత, సామాజిక వర్గాల స్థాయుల్లో జనాభా మార్పుల సరళిని విశ్లేషించడం ఈ కమిటీ పని అని పేర్కొన్నారు. దేశంలో మారుతున్న జనాభా తీరుపై కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాట్లను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## ఇష్టానుసారం మాట్లాడితే చేతులు కట్టుకుని కూర్చోవాలా?: పవన్‌కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)



అన్నీ పోగొట్టుకునేందుకు సిద్ధంగా ఉండి రాజకీయాల్లోకి వచ్చానని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ఉద్దేశించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే.. తామూ ఎదురుదాడి చేస్తామని హెచ్చరించారు. తనను విమర్శించే వాళ్లు రాగలరా అని ప్రశ్నించారు. "ఎక్కడ ఎలాంటి గొడవలు పెట్టుకుంటారో చెప్పండి.. నేను సిద్ధం. ఛాయిస్ మీకే ఇస్తున్నా.. ▶మిగతా 2లో

## ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**ఏపీ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదల**

**ఫలితాలను ప్రకటించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్**

**ఈ ఏడాది 99.30 శాతం ఉత్తీర్ణత నమోదు**

**పరీక్షకు హాజరైన 19,880 మందిలో 19,741 మంది అర్హత**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)



అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్‌లోనూ ఫలితాలు అందుబాటులో ఆంధ్రప్రదేశ్‌లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఎడ్‌సెట్)-2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ▶మిగతా 2లో

# నేడు,రేపు ... టీడీపీ సరికొత్త మహానాడుకు సర్వం సిద్ధం

- ఈసారి భౌతికంగా కాకుండా హైబ్రిడ్ పద్ధతిలో డిజిటల్ వేదికగా ఏర్పాటు
- మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి 1,848 క్లస్టర్లకు అనుసంధానం
- 'స్త్రీశక్తి' ప్రధాన ఇతివృత్తంగా జరగనున్న ఈ ఏడాది మహానాడు
- ప్రధాని మోదీ పిలుపు మేరకు ఖర్చులు తగ్గించి, నిధులు పార్టీకి వినియోగం




(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)

తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు' కార్యక్రమం ఈసారి సరికొత్త రూపంలో జరగనుంది. దేశ రాజకీయాల్లోనే ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుడుతూ, మే 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్ మహానాడు' నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ కేంద్ర కార్యాలయం వేదికగా జరగనున్న ఈ కార్యక్రమాన్ని, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్లకు డిజిటల్ సాంకేతికత ద్వారా అనుసంధానించి, లక్షలాది మంది కార్యకర్తలను భాగస్వాములను చేయనున్నారు. 'స్త్రీశక్తి'ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని ఈ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ▶మిగతా 2లో

## మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు.. 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 26)

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ దశాబ్ద కాలానికి పైబడిన ప్రస్థానాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివర్ణించింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన '22 ముఖ్యమైన విజయాలను' ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ▶మిగతా 2లో


## ఏమిటీ 'అబ్రహాం అకార్డ్స్'.. ఇరకాటంలో పాకిస్థాన్!

**అబ్రహాం ఒప్పందాల్లో చేరాలన్న ట్రంప్ పిలుపును తిరస్కరించిన పాకిస్థాన్**

**ఇజ్రాయెల్‌తో సంబంధాలు తమ సిద్ధాంతాలకు విరుద్ధమని స్పష్టీకరణ**

**పాలస్తీనా ఏర్పాటే తమ విధానమని మరోసారి తేల్చిచెప్పిన పాక్**

**నమ్మలేని వాళ్లతో ఎలా మాట్లాడతామని ప్రశ్నించిన రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 26)

ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చే అబ్రహాం ఒప్పందాల్లో (అబ్రహాం అకార్డ్స్) చేరాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన పిలుపును పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యం కాదని, అది తమ దేశ మౌలిక సిద్ధాంతాలకు విరుద్ధమని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తేల్చిచెప్పారు.ఒక స్థానిక టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1967కి ముందున్న సరిహద్దులతో, తూర్పు జెరూసలేం రాజధానిగా పాలస్తీనా దేశం ఏర్పడే వరకు ఇజ్రాయెల్‌ను గుర్తించే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు. "ఒక్క రోజు కూడా మాట మీద నిలబడలేని వ్యక్తులతో మీరు ఎలా కూర్చుంటారు?" అని ఆయన ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు.ఇరాన్‌తో చర్చల్లో భాగమైన సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు అబ్రహాం ఒప్పందాల్లో చేరాలని ఇటీవల ▶మిగతా 2లో

## బిజినెస్ నిబంధనలు సవరించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)

ప్రజలకు ప్రభుత్వ సేవలు సులువుగా అందించే క్రమంలో నిబంధనలు అడ్డుకాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. దీనికోసం అవసరమైన బిజినెస్ నిబంధనలను సవరించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై సీఎం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 'ప్రజల కోసం అధికారులు, ఉద్యోగులు, ▶మిగతా 2లో

## వైఎస్ కుటుంబానికున్నది దౌర్జన్య బలమే

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)

వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి దౌర్జన్య బలం తప్పితే ప్రజాబలం ఎప్పుడూ లేదని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. దిల్లీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.



"తాము తిరుగులేని నాయకులమని సామాజిక మాధ్యమాల్లో గ్రాఫిక్స్ వేసుకొనే వైఎస్ కుటుంబానికి అసలైన ప్రజాబలం ఎప్పుడూ లేదు. వార్డు మెంబర్ స్థానాన్ని కూడా గెలవలేక ప్రజల ఛీత్కారానికి గురైన చరిత్ర వారిది. ప్రజల మనసులను చూరగొని ఎన్నికల్లో గెలవలేమనే నైరాశ్యంతోనే వారు రాజకీయాల్లో రౌడీయిజం అనే ఆయుధాన్ని ప్రయోగించడం మొదలుపెట్టారు. పచ్చని పల్లెల్లో రక్తపుటేరులు పారించారు. రాష్ట్రంలో ఏమూల ▶మిగతా 2లో



## వెళ్లగొట్టకముందే పారిపోండి: అక్రమ వలసదారులకు సువేందు హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారులపై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. ▶మిగతా 2లో

## లౌకిక శక్తులు మరింత బలపడాలి



**భాజపా, ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా ఐక్యం కావాలి**

**ప్రతిపక్షాల ఐక్యతకు కాంగ్రెస్ గండి**

**తృణమూల్‌తో ఇప్పట్లో కలవబోం**

**సీపీఎం స్పష్టీకరణ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)

భాజపా, ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా లౌకిక శక్తులు మరింత బలపడాల్సిన అవసరాన్ని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గుర్తు చేశాయని సీపీఎం స్పష్టం చేసింది. అయితే లౌకిక శక్తుల ఏకీకరణకు కాంగ్రెస్ గండి కొడుతోందని ఆరోపించింది. తృణమూల్ కాంగ్రెస్‌తో ఇప్పట్లో అవగాహనకు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. దిల్లీలో ఈ నెల 22 నుంచి 24 వరకూ సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలు జరిగాయి. ఇందులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్ష జరిగింది. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఆ సమావేశ వివరాలను సోమవారం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ మీడియాకు ▶మిగతా 2లో




## అమరావతిపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 26)

'హైదరాబాద్‌లో సెక్రటేరియట్, దిల్లీలో పార్లమెంటు నిర్మాణ వ్యయాలపై పూర్తి డేటాతో జగన్ మాట్లాడాలి. ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదు. జనం నవ్వుకుంటున్నా.. మావిగన్ అంటూ సిగ్గులేకుండా వేలాడుతున్నారు' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మండిపడ్డారు. ఆయన సోమవారం రాత్రి రాజధానిలో పర్యటించి పలు నిర్మాణ పనులను పరిశీలించారు. అఖిల భారత సర్వీసుల అధికారుల భవనాలు, నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. ▶మిగతా 2లో

# నేడు,రేపు... టీడీపీ సరికొత్త మహానాడుకు సర్వం సిద్ధం

**ప్రధాని పిలుపుతో ప్రణాళికలో మార్పు**

వాస్తవానికి ఈ ఏడాది మహానాడును నెల్లూరులో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని టీడీపీ మొదట ప్రణాళిక రచించింది. అయితే, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ పౌరులు ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకున్నట్లు పల్లా శ్రీనివాస రావు వివరించారు. దేశ యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకుని, భారీ ఖర్చుతో కూడిన భౌతిక కార్యక్రమాన్ని రద్దు చేసుకుని, హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పు ద్వారా ఆదా అయిన నిధులను పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. ఈ నిర్ణయం దేశం కోసం టీడీపీ వేస్తున్న డిజిటల్ అడుగులకు నిదర్శనమని ఆయన అభివర్ణించారు.

**లోకేష్ మార్క్.. డిజిటల్ విప్లవం**

ఈ హైబ్రిడ్ మహానాడు ఆలోచన వెనుక పార్టీ యువ నాయకుడు, హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నారా లోకేష్ దార్శనికత ఉందని పల్లా తెలిపారు. ఆయన అనుభవం, సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగుదేశం పార్టీని డిజిటల్ యుగంలోకి నడిపిస్తున్నారని కొనియాడారు. సుమారు రెండు వేల క్లస్టర్ల ద్వారా లక్షలాది మంది కార్యకర్తలను ఏకకాలంలో అనుసంధానించడం ఒక ప్రాంతీయ పార్టీకి రికార్డు అని, ఇది దేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నిర్వహించనున్న ఈ హైబ్రిడ్ మహానాడుపై ఇతర రాజకీయ పార్టీల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు.

**హైబ్రిడ్ మహానాడు ఇలా..**

మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు, నారా లోకేష్ సహా ముఖ్య నేతలు పరిమిత సంఖ్యలో భౌతికంగా పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 1,848 క్లస్టర్ల వద్ద భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ప్రతి క్లస్టర్ నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలు, నేతలు నేరుగా చంద్రబాబు, లోకేష్‌లతో మాట్లాడే అవకాశం కల్పిస్తారు. దీనివల్ల ప్రతి కార్యకర్త నేరుగా మహానాడులో పాల్గొన్న అనుభూతి పొందుతాడని పార్టీ భావిస్తోంది. గతంలో వేలాది మంది మాత్రమే పాల్గొనే అవకాశం ఉండగా, ఈసారి లక్షలాది మందికి మహానాడు చేరువ కానుంది.

**స్త్రీశక్తి, ఇతర అంశాలపై చర్చ**

ఈ ఏడాది మహానాడులో 'స్త్రీశక్తి' ప్రధాన అంశంగా ఉండనుంది. మహిళా సంక్షేమం కోసం టీడీపీ గతంలో చేసిన కృషి, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించనున్నారు. దీంతో పాటు 'కాక్రోచ్ జనతాపార్టీ' వంటి రాజకీయ అంశాలు, ఆరోగ్యకరమైన సోషల్ మీడియా వినియోగాన్ని ప్రోత్స హించడం వంటి అంశాలపై కూడా చర్చలు, తీర్మానాలు ఉంటాయని పల్లా శ్రీనివాస రావు తెలిపారు.

**సర్వం సిద్ధం.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి క్లస్టర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, గత 10 రోజులుగా తాను కేంద్ర కార్యాలయం నుంచే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నానని పల్లా వివరించారు. కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, తెలుగు జాతి గర్వించే ఈ పసుపు పండుగను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ఈ ఏడాది ఎడ్‌సెట్‌లో రికార్డు స్థాయిలో 99.30 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 19,880 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 19,741 మంది అర్హత సాధించినట్లు మంత్రి లోకేష్ తన ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచి, అర్హత సాధించిన అభ్యర్థులందరికీ ఆయన శు భాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ఛవ్ం.ఖజూంఎప్త్రవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా, 9552300009 అనే వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలను సులభంగా తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. ఎడ్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు తదుపరి కౌన్సెలింగ్‌కు హాజరై, రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు.

# వెళ్లగొట్టకముందే పారిపోండి: అక్రమ వలసదారులకు సువేందు హెచ్చరిక

బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు.

## మొదటి పేజీ తరువాయి

**నిర్బంధ కేంద్రాల ఏర్పాటు..**

బెంగాల్ ప్రభుత్వం "గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి" అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు (ఝశీశ్రీసఱఅస్త్ర ఎవశ్‌తీవం) ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**సరిహద్దు సమీపంలో బంగ్లాదేశీయులు**

అక్రమంగా రాష్ట్రంలోకి వలస వచ్చిన వారిపై బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు తమ స్వదేశానికి పయనమవుతున్నారు. మంగళవారం ఉదయం ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హాకీంపుర్ సరిహద్దు ప్రాంతంలో పదుల సంఖ్యలో బంగ్లాదేశీయులు గుమిగూడినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ చేపట్టిన సమయంలో కూడా ఈ సరిహద్దు నుంచి వందల సంఖ్యలో బంగ్లాదేశ్‌కు వెళ్లినట్లు తెలిపారు.

# బిజినెస్ నిబంధనలు సవరించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలి. దానికి అనుగుణంగా ఫలితాలు ఉండాలి. ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి నోడల్ అధికారులను నియమించాం. వారి సేవలు పూర్తిగా వినియోగించుకోవాలి. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారంపై మరింత శ్రద్ధ పెట్టాలి. ఏడాదిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పరిష్కారం కాని సమస్యలపై దృష్టి పెట్టాలి. ప్రత్యేకించి కుటుంబ తగాదాలతో ఉత్పన్నమయ్యే సమస్యలపై అధికారులు వారితో మాట్లాడి పరిష్కరించాలి. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలి. ఆసుపత్రుల్లో అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దు. ఆర్టీజీఎస్ విభాగానికి అన్ని శాఖల సమాచారం పూర్తిగా అందించాలి. దీన్ని సమన్వయం చేసుకునేలా ప్రతి శాఖ నుంచి ఒక అధికారిని అందుబాటులో ఉంచాలి. సైబర్ నేరాలను అరికట్టేలా పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేయాలి' అని సీఎం సూచించారు. సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

# ఇష్టానుసారం మాట్లాడితే చేతులు కట్టుకుని కూర్చోవాలా?: పవన్‌కల్యాణ్

అంతేగానీ నన్ను రెచ్చగొట్టొద్దు" అని వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరంలో జనసేన నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడారు.

**అది పిచ్చి లాజిక్..**

"జగన్‌ను జైలుకు పంపాలని నేను కోరినట్లు ఓ విశ్లేషకుడు చెప్పడంలో ఉన్న లాజిక్ ఏంటో అర్థం కావట్లేదు. జగన్ జైలుకు వెళ్తే నాకు లాభం చేకూరుతుందనడం పిచ్చి లాజిక్. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు నేను ప్రయత్నిస్తే సీఎం అయ్యేవాడిని కదా? నా సిద్ధాంతం అది కాదు. శత్రువు బలంగా ఉన్నప్పుడే కొడతా.. బలహీనంగా ఉన్నప్పుడు కొట్టను. విశ్లేషించే వారిని ప్రశ్నిస్తే.. కులం కార్డును పట్టుకొస్తామంటే ఎలా? ఇష్టానుసారం మాట్లాడితే చేతులు కట్టుకుని కూర్చోవాలా.. మాకు కోపం రాదా? కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నామని అనుకుంటున్నాయి. దీటుగా మేం ఎదురుదాడి చేస్తాం.. మీరు వ్యక్తిగతంగా అంటే.. మేమూ అంటాం. ఛాయిస్ ఈజ్ యువర్స్. మితిమీరిన సహనం చేతగానితనం అయిపోతుంది. మౌనంగా ఉన్నానంటే.. మెత్తగా ఉన్నానని కాదు.. గట్టిపడుతున్నానని అర్థం. సరైన సమయం కోసం చూస్తున్నా.. అంతే కానీ బలహీనత కాదు.

**క్రమశిక్షణతో ఉంటేనే కూటమిలో బలం**

పార్టీ నడపాలంటే క్రమశిక్షణ కావాలి. అలా ఉంటే తప్ప కూటమిలో బలం రాదని గుర్తించాలి. జనసేన నేతలు పదవులు ఇస్తే ఉత్సాహంగా పనిచేస్తారనుకుంటే.. మాట్లాడటం మానేశారు. పదవులు ఇవ్వగానే అందరూ పెద్దమనుషులు అయ్యారు. పదవుల కోసమే అయితే జనసేనలో ఉండాల్సిన అవసరం లేదు. అర్ధరాత్రి జనసేన జెండా పట్టుకుని చిన్నారితో ఉన్న మహిళను చూస్తే అది కదా పార్టీ బలం అనిపించింది. పోరాడటం జనసేన మూల లక్షణం. కూటమి కోసం కొన్నిసార్లు సర్దుకుంటాను.. ఇది ఒక పార్టీ గురించి కాదు. ఐదు కోట్ల ప్రజల గురించి కొన్నిసార్లు భరిస్తానని గుర్తించాలి" అని పవన్‌కల్యాణ్ అన్నారు.

# మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు.. 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక

ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు.

**'సంకల్పం నుంచి సాఫల్యం' యాత్రగా అభివర్ణించిన నితిన్ నబిన్**

ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని 'సంకల్పం నుంచి సాఫల్యం వరకు' సాగిన యాత్రగా అభివర్ణించారు. "2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు.

**మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్': రాజ్‌నాథ్ సింగ్**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. 2014 మే 26న భారతదేశ అభివృద్ధి, నాగరిక ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని అన్నారు. "ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం నుంచి ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ పరివర్తన వరకు, మౌలిక సదుపాయాల నుంచి బలమైన జాతీయ భద్రత వరకు ప్రతి రంగంలోనూ దేశం అపూర్వమైన వేగంతో పురోగమించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. దేశ వృద్ధి ఇప్పుడు మరింత విస్తృతమైనదిగా, సమ్మిళితమైనదిగా మారిందన్నారు. దశాబ్దాలుగా తెరమరుగైన కోట్లాది మంది ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యారని, మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్' అని కొనియాడారు.

**ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం': శివరాజ్ సింగ్ చౌహాన్**

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గడిచిన 12 ఏళు సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి అంకితమైనవని అన్నారు. ఒకప్పుడు దేశం ఎదుర్కొన్న 'విధానాల పక్షవాతం' నుంచి బయటపడి 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' (=వటశీతీఎ, ్రావతీటశీతీఎ, ్తీaఅంటశీతీఎ) మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కాలాన్ని భారతదేశ పునర్నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం'గా అభివర్ణించారు. జన్ ధన్ ఖాతాల నుంచి ఆయుష్మాన్ భారత్ వరకు, పీఎం ఆవాస్ యోజన నుంచి డిజిటల్ ఇండియా వరకు ఎన్నో పథకాలతో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు.

# ఏమిటీ 'అబ్రహాం అకార్డ్స్'.. ఇరకాటంలో పాకిస్థాన్!

ట్రంప్ పిలుపునిచ్చారు. ఇప్పటికే యూఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలు ఈ ఒప్పందాల్లో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రతిపాదనకు పాక్ నుంచి గట్టి వ్యతిరేకత వ్యక్తమైంది. ట్రంప్ ప్రతిపాదన పాకిస్థాన్‌ను ఇరకాటంలో పడేసింది. ఏళ్లుగా దెబ్బతిన్న అమెరికాతో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని ఇస్లామాబాద్ భావిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ విషయంలో తమ వైఖరిని మార్చుకోవడం అసాధ్యమని స్పష్టం చేస్తోంది. పాకిస్థాన్ దేశంలో పాలస్తీనాకు బలమైన ప్రజా మద్దతు ఉండటమే దీనికి కారణం. 78 ఏళ్ల పాక్ చరిత్రలో ఇజ్రాయెల్‌ను ఎన్నడూ గుర్తించలేదు. ఆ దేశ పాస్‌పోర్టులపై కూడా 'ఈ పాస్‌పోర్ట్ ఇజ్రాయెల్ మినహా అన్ని దేశాలకు చెల్లుతుంది' అని స్పష్టంగా ఉంటుంది. ప్రస్తుతానికి, అమెరికా ఒత్తిడి కంటే తమ సంప్రదాయ వైఖరికే పాకిస్థాన్ కట్టుబడి ఉందని ఆసిఫ్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# వైఎస్ కుటుంబానికున్నది దౌర్జన్య బలమే

రాజకీయ హత్య జరిగినా.. దాని లింకులు పులివెందుల ప్యాలెస్‌కు ఉంటాయి. రాజకీయంగా ఎదుర్కోలేక ప్రత్యర్థులను భౌతికంగా నిర్మూలించే నీచానికి ఒడిగట్టారు. వారి రక్తచరిత్రను దేశంలోని అన్ని ప్రధాన భాషల్లో పుస్తకాలుగా ముద్రించి పంచుతాం" అని వెల్లడించారు.

# లౌకిక శక్తులు మరింత బలపడాలి

వెల్లడించారు. 'ఇటీవలి ఎన్నికలు పెరుగుతున్న మితవాద రాజకీయ ప్రభావాన్ని ప్రతిఫలించాయి. దీనిపై ప్రతిపక్షాలు లోతైన సమీక్ష జరపాల్సిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు, నయా ఫాసిస్టు విధానాలతో వెళ్తోంది. భాజపా, ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా బలంగా వ్యవహరించేందుకు ప్రతిపక్షాలు సిద్ధం కావాలి. అయితే లెఫ్ట్, ప్రాంతీయ పార్టీల పట్ల కాంగ్రెస్ అనుసరిస్తున్న ధోరణి అటువంటి ఐక్యతకు అనుకూలంగా లేదు' అని పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఏళ్లుగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ వచ్చిందని, ఇటీవలి ఎన్నికల సమయంలో తమ పార్టీ కార్యకర్త ఒకరు దారుణ హత్యకు గురయ్యారని బేబీ తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా ఆ పార్టీ అడ్డుకుందని పేర్కొన్నారు. అందువల్ల తృణమూల్‌తో అవగాహనకు రావడం ఇప్పట్లో కుదరని పని అని స్పష్టం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీని (సీజేపీ) అణచివేసేందుకు కేంద్రం చేపట్టిన చర్యలను బేబీ ఖండించారు. సీజేపీ దేశ యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తికి అద్దం పట్టిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారితీసిన రాజకీయ, వ్యవస్థాగతపరమైన, సైద్ధాంతికపరమైన కారణాలపై సమావేశాల్లో పార్టీ సమీక్షించింది. రాష్ట్ర సాయిల్లో సమీక్షలు జరపాలని నిర్ణయించింది.


# అమరావతిపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

'హైదరాబాద్‌లో సచివాలయం నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.13,768 ఖర్చు అయింది. దిల్లీలో పార్లమెంటు నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.16,916 వెచ్చించారు. అమరావతి ఐకానిక్ టవర్లకు సంబంధించి చదరపు అడుగుకు రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకు ఖర్చు అవుతుంది. అయితే అంతకన్నా ఎక్కువ వెచ్చిస్తున్నారంటూ జగన్ అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అమరావతిపై ఇలాగే విష ప్రచారం చేస్తే జగన్‌కు ఉన్న 11 సీట్లు కాస్తా.. వచ్చే ఎన్నికల్లో సున్నాగా మారతాయి' అని మంత్రి అన్నారు. అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్లు, అధికారుల నివాస భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోందని, అఖిల భారత సర్వీసుల ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న 6 టవర్లలో చాలా వరకు పనులు పూర్తయ్యాయని, జూన్ నుంచి దశలవారీగా భవనాలను జీఏడీకి అప్పగిస్తామని నారాయణ చెప్పారు.

# పది పాస్ అయిన విద్యార్థులు బంగారు బాటలు వేసుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)**

పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు మంచి కోర్సులు ఎంపిక చేసుకొని బంగారు బాటలు వేసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు విద్యార్థులకు సూచించారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్ లో పాఠశాలల వారీగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఎమ్మెల్యే ప్రతిభా అవార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎంత ఆస్తి ఉన్న చదువుతో సమానం కాదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎలా చదువుతున్నది పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. తల్లిదండ్రులు పట్టించుకోకపోతే విద్యార్థులు దారి తప్పే ప్రమాదం ఉందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రైవేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాలు ఇందుకు నిదర్శనం అన్నారు. డీజేఆర్ ట్రస్ట్ ద్వారా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించి ప్రతియేటా 100 మంది విద్యార్థులను ఆరవ తరగతి నుండి చదివిస్తున్న విషయాన్ని దామచర్ల గుర్తు చేశారు. అపుస్మా రాష్ట్ర అ ధ్యక్షుడు తులసిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను స్ఫూర్తిగా తీసుకొని తమ అసోసియేషన్ ద్వారా తొలిసారిగా పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీ హర్షిని విద్యా సంస్థల చైర్మెన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 6వ తరగతిలో చేరే విద్యార్థులకు జూలై 16 నుండి 18 తేదీ వరకు స్కూల్ లెవల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించాలని కోరారు. అందులో టాప్ 10 విద్యార్థులను ఒంగోలులో 21వ తేదీ జరిగే ఎంట్రెన్స్ టెస్ట్ కు పంపించాలని కోరారు. పేద, టాలెంట్ కలిగిన విద్యార్థులకు 5 సంవత్సరాలు డీజేఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్యను అందిస్తారని తెలిపారు. ఒక్కో విద్యార్థి కోసం డీజేఆర్ ట్రస్ట్ ద్వారా దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేస్తుందని, ఈ అవకాశాన్ని పేద మెరిట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇంచార్జి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, పాల్గొన్నారు.









ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

27.05.26 బుధవారం

# వరుస దొంగతనం కేసులను ఛేదించిన కంభం సీఐ మల్లికార్జున




### మార్కాపురం జిల్లాలో జరిగిన మూడు కీలక చోరీ కేసుల్లో

### ముగ్గురు ముద్దాయిల అరెస్ట్

### రూ.12.05 లక్షల బంగారం, నగదు స్వాధీనం

### సీఐ, పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ

(షణ్ముఖ వెలుగు, కంభం, మే 26)

మార్కాపురం జిల్లాలో సంచలనం సృష్టించిన వరుస రాత్రి దొంగతనం కేసులను కంభం సీఐ కె మల్లికార్జున ఆధ్వర్యంలోని పోలీసులు చాకచక్యంగా ఛేధించి ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేశారు. కేసులను వేగంగా ఛేదించి దొంగిలించిన ఆస్తిని రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ నాగరాజు అభినందించారు. మంగళవారం కంభం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పీ యు నాగరాజు కేసు వివరాలు వెల్లడించారు. మార్కాపురం టౌన్, పెద్దారవీడు, అర్ధవీడు స్టేషన్ పరిధిలో పలు దొంగతనాల కేసుల్లో ముగ్గురు నిందితులు దూదేకుకల ఖాసిం వలి (చిన్న ఖాసిం వలి), ఈర్ల అంకమ్మరాజు, కందుల షద్రక్ (అశోక్)లను 25వ తేదీ సాయంత్రం అర్ధవీడు మండలం నాగులవరం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి, దొంగిలించిన బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరు అర్ధవీడు మండలంలో గన్నేపల్లి గ్రామానికి చెందిన కనుమర్లపూడి వెంకట సురేష్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి శ్రీశైలం వెళ్లిన విషయాన్ని గమనించి 11వ తేదీ తెల్లవారుజామున ఇంటి వెనుక ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఇద్దరు ముద్దాయిలు తలుపులు, బీరువా పగులగొట్టి ఒక గోల్డ్ బిస్కెట్, మూడు బంగారు ఉంగరాలు, బంగారు జాలర్లు, చెవి బుట్టలు, నాలుగు జతల చెవి కమ్మలు కలిపి సుమారు 120 గ్రాముల బంగారం, రూ.50 వేల నగదు అపహరించారు. మొత్తం దొంగిలించిన ఆస్తి విలువ సుమారు రూ.12.50 లక్షలు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామానికి చెందిన మట్టి వెంకట లక్ష్మమ్మ ఇంటిలోకి ప్రవేశించిన ప్రధాన నిందితుడు చిన్న ఖాసిం వలి, బీరువా తాళాలు పగులగొట్టి సుమారు రూ.15 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను దొంగిలించినట్లు తెలిపారు. అనంతరం ఆ సొత్తును మార్కాపురంలోని తనకు పరిచయమున్న వ్యక్తికి అప్పగించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. మార్కాపురం పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ నగర్ కాలనీలో చిలకపాటి రాజబాబు ఇంటిలోకి ప్రవేశించిన నిందితుడు బీరువా పగులగొట్టి రెండు గోల్డ్ కలర్ వాచీలు, రెండు వెండి మెడల్స్ అపహరించాడు. అనంతరం వాటిని విజయవాడ భవానీపురంలో గుర్తుతెలియని వ్యక్తికి విక్రయించి వచ్చిన డబ్బును స్వంత ▶ మిగతా 2లో



# ప్రజల సంతృప్తి మేరకు పని చేయడమే అధికారుల లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 26)

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సంతృప్తి మేరకు పూర్తిస్థాయిలో పనిచేయడమే అధికారుల లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో పెన్షన్స్, ▶ మిగతా 2లో



# లోప రహిత ఓటర్ల జాబితా రూపకల్పన పై ప్రత్యేక దృష్టి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 26)

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా లోప రహిత ఓటర్ల జాబితా రూపకల్పన పై ప్రత్యేక దృష్టి సాధించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ చెప్పారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా లోపరహితంగా ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో 80 శాతానికి తగ్గకుండా, గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతానికి పైగా మ్యాపింగ్ జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్లు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి బిఎల్వోలు చేస్తున్న ఈ ప్రక్రియను పరిశీలించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి రాజాబాబుతో పాటు డిఆర్ఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వెలుగు కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు

షణ్ముఖ వెలుగు ఎఫెక్ట్



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 26)

మేదరమెట్లలో పైలాన్ సెంటర్ వద్ద రోడ్డు వెంబడి వ్యర్థాలతో దుర్వాసన వస్తుండడంతో మంగళవారం షణ్ముఖవెలుగు దినపత్రికలో "వెయ్యి ఫైన్...అయితే మాకేంటి?" అనే శీర్షిక ప్రచురితం అయింది. దీంతో మంగళవారం గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించారు. పంచాయతీ సెక్రెటరీ లక్ష్మీకాంత్ ప్రోక్లైన్‌తో రోడ్డు వెంబడి వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాదర్శి మాట్లాడుతూ వ్యాపారస్తులకు అనేక సార్లు చెప్పిన రాత్రిపూట వ్యర్థాలు వేస్తున్నారని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. గ్రామంలో నిరంతరం శానిటేషన్ పనులు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలియజేశారు. స్వచ్ఛ గ్రామానికి వ్యాపారస్తులతో పాటు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్న షణ్ముఖ వెలుగు దినపత్రిక యాజమాన్యానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ▶ మిగతా 2లో

# రంగం ఏదైనా ఉన్నత స్థాయికి ఎదగడమే శ్రీ వాత్సల్య లక్ష్యం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 26)

పిట్టకొంచం కూత ఘనం అన్నట్లుగా శ్రీ వాత్సల్య అటు చదువు, ఇటు నృత్యం, కరాటే పోటీల్లో మంచిగా రాణిస్తూ పెద్దల మన్నలను అందుకుంటూ మంచి పేరు తెచ్చుకుంటుంది. పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న శ్రీ వాత్సల్య ఓ వైపు భరతనాట్యం, ఇతర నృత్యాలతో అందరినీ ఆకట్టుకుంటుంది. కరాటేలో గత రెండు సంవత్సరాలకు పైగా తను కష్టపడి నేర్చుకుని నేడు కలర్ బెల్ట్ పోటీల్లో విజేతగా నిలిచింది. బ్లాక్ బెల్ట్ సాధించడమే లక్ష్యంగా కరాటే ను శ్రద్ధతో నేర్చుకుంటున్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. కరాటేలో రోజు మాస్టర్ చిన్న రాజు తమ కుమార్తెకు మరిన్ని మెలకువలు నేర్పిస్తున్నారని, ఆయన శిష్యురాలిగా ఆయనకు మంచి పేరు తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తుందని తల్లిదండ్రులు తెలిపారు. త్వరలోనే తమ కుమార్తె వాత్సల్య బ్లాక్ బెల్ట్ సాధిస్తుందని మాస్టర్ తెలియజేశారని వారు తెలిపారు. ఈ పాటికే నాట్యంలో ఎన్నో మెలుకవులు తమ కుమార్తె నేర్చుకుని అనేక వేదికల పైన నృత్య ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. ఈ పాటికే అనేక బహుమతులు, ప్రశంసలు అందుకున్న తమ కూతురు రాబోయే రోజుల్లో అటు నృత్యం, ఇటు కరాటే లో మంచి స్థాయికి ఎదిగేందుకు తమ వంతు కృషి ఎళ్ళవేళలా ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలో ఒంగోలుకు చెందిన నాట్య గురువు లక్ష్మి దగ్గర నాట్యంలో ▶ మిగతా 2లో

## గోవధ జరగకుండా ముస్లిం పెద్దలకు అవగాహన





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 26)
బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బక్రీద్ సందర్భంగా గోవధ జరగకుండా ప్రభుత్వం, న్యాయస్థానాల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ముస్లిం పెద్దలకు సీఐ సూచించారు. అలాగే ముస్లిం పెద్దలు తమ వంతుగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నిషేధిత జంతువుల వధకు దూరంగా ఉండాలని, పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన కోరారు. సామాజిక సామరస్యాన్ని కాపాడుతూ ఎలాంటి అపోహలు, వివాదాలకు తావులేకుండా అందరూ సహకరించాలని సిఐ రాజేష్ కుమార్ ముస్లిం పెద్దలను కోరారు. ఇందుకు ముస్లిం పెద్దలు పూర్తిగా ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సూరెడ్డి రాజేష్, ముస్లిం, హిందూ మత పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్‌గా పిన్నిక మధు కు పదోన్నతి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)



ఒంగోలు తహసీల్దార్ గా పనిచేస్తున్న పిన్నిక మధు సుధన్ కు డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూశాఖ నుండి అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గతంలో కొమరోలు, పెద్దారవీడు, బల్లికురవ, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన ఒంగోలు తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈయన పని చేసిన అన్ని ప్రాంతాల్లో రెవిన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు పొందారు. ఈయనకు గతంలో రెండు పర్యాయాలు డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి లభించినప్పటికీ, దాన్ని సున్నితంగా తిరస్కరించి తహసీల్దార్ గానే కొనసాగుతుండడం విశేషం. తిరిగి ప్రస్తుతం మూడవసారి పదోన్నతి లభించడంతో డిప్యూటీ కలెక్టర్‌గా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. విధి నిర్వహణలో సమర్ధవంతంగా బాధ్యతలను నిర్వర్తించిన సందర్భంగా ఈయన ప్రభుత్వ ఉన్నతాధికారుల నుండి పలు సార్లు ప్రశంసలను అందుకున్నారు.

## జిల్లా విద్యాశాఖాధికారిని సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేసిన యుస్‌టియు




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 26)
రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎర్రగొండపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు మొదటిసారి రివ్యూ సమావేశానికి విచ్చేసిన మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావుకి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శామ్యూల్, డి తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశానాయక్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని ఆన్లైన్ ద్వారా నిర్వహించే విధంగా విజ్ఞప్తి చేశారు. అలాగే మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయు విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మానంద ప్రభాకర్, ఆంజనేయులు, సతీష్ కుమార్, సుబ్బారావు, చక్రపాణి పార్థసారథి, యంఎల్ నారాయణ, అబ్దుల్ కలాం, గుల్షాన్ బేగ్, ఎంజె ప్రసాద్, జీవి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రంగం ఏదైనా ఉన్నత స్థాయికి ఎదగడమే శ్రీ వాత్సల్య లక్ష్యం





మరిన్ని మెలుకవలు మా అమ్మాయి నేర్చుకుంటుందన్నారు. ఈ మధ్య కాలంలో శ్రీశైల మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో తమ కుమార్తె ఆలయ అధికారులు, ఆలయ అర్చకుల నుంచి వేద ఆశీర్వచనాలు అందుకుని మంచి ప్రసంసలు అందుకుందన్నారు. అందుకు నాట్య గురువు లక్ష్మి తాము రుణపడి ఉంటామన్నారు.

## వెలుగు కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు


షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

### వెయ్యి ఫైన్...అయితే మాకేంటి?

(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 25)
మేదరమెట్లలోని పైలాన్ సెంటర్ వద్ద రోడ్డు వెంబడి కొంతమంది వ్యాపారస్తులు వ్యర్థాలను వేయడంతో ఆ మార్గాన వెళ్లాలంటేనే ప్రయాణికులు ముక్కు మీద వేలు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దుర్వాసన వస్తుండడంతో అ మార్గాన వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నామని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు రోడ్డు వెంబడి వ్యర్థాలు వేస్తే రూ.1,000 లు ఫైన్ అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ అయితే మాకేంటి అనే ధోరణిలో వ్యాపారస్తులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గ్రామపంచాయతీ అధికారులు వెయ్యి రూపాయలు ఫైన్‌ను అమలు చేస్తేనే కొంతమేర సమస్య పరిష్కారం అవుతుందని పలువురు ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వెంబడి దుర్వాసన వచ్చే చెత్త సమస్యను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రైవర్‌పై వేటు వెనక్కి.. విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం



(హైదరాబాద్, అమరావతి,మే 26)
కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్లు ఆయన మంగళవారం తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు. దానిని మేము స్వాగతిస్తున్నాం. అందుకే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని విపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

**అసలేం జరిగిందంటే..** సోమవారం జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు నడుపుతున్న సమయంలో, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేపట్టిన ధర్నాపై డ్రైవర్ అశోక్ స్పందించారు. నిరసనల కన్నా రైతుల నుంచి మొక్కజొన్న, పత్తి వంటి పంటలను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఈ వ్యాఖ్యలపై స్థానిక కాంగ్రెస్ నేత ఒకరు ఫిర్యాదు చేయడంతో, డ్రైవర్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించాలని బస్సు యజమానికి జగిత్యాల డిపో మేనేజర్ లేఖ రాశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కవిత తీవ్రంగా స్పందించారు. ప్రశ్నించిన వారి ఉద్యోగాలు తీసేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి.. ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను కలిసి అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

# ప్రజల సంతృప్తి మేరకు పని చేయడమే అధికారుల లక్ష్యం

ఐవిఆర్ఎస్ కాల్స్ పై జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షన్ పంపిణీలో నిర్లక్ష్యం వహించకుండా జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పెన్షన్ ఇవ్వడం లేదని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అదేవిధంగా లబ్ధిదా రులు ప్రతినెల కచ్చితంగా పెన్షన్ తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఐవిఆర్ఎస్ సర్వే లో సైతం కొంత వెనుకబాటు కనబడు తుందని దాన్ని సరి చేసుకో వాలన్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లో ఈ రెండు అంశాల్లో పని తీరు మెరుగు పరచుకుని ముందు కు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డీఆర్‌డిఏ ఇన్‌చార్జి పీడీ నీలకంఠా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనం కేసులను ఛేదించిన కంభం సీఐ మల్లికార్జున

ఖర్చులకు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు చిన్న ఖాసిం వలి పై గతంలో పెద్దారవీడు, అర్ధవీడు, మార్కాపూర్ రూరల్, మార్కాపూర్ టౌన్ పోలీస్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్ దొంగతనాలు, నైట్ బర్గ్లరీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. అతని పై 14.10.2021న పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ నెం.21 కూడా ఓపెన్ చేసినట్లు తెలిపారు. మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ యు నాగరాజు పర్యవేక్షణలో కంభం సీఐ కె మల్లికార్జున, అర్ధవీడు ఎస్ఐ శివ నాంచారయ్య, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులను సమర్ధవంతంగా ఛేదించిన కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్ఐ శివ నాంచారయ్య, పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# మహానాడు సందర్భంగా ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం

## ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో ప్రజలకు విస్తృత వైద్య సేవలు
## 1200 మందికి పైగా హాజరు
## విశేష స్పందన




(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 26)
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి, మహానాడు వేడుకల సందర్భంగా పర్చూరులో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో పర్చూరు మండల కేంద్రంలోని కొల్లావారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 1200 మందికి పైగా ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, నోవా అగ్రి గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మహానాడు వేడుకల నేపథ్యంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**ప్రముఖ వైద్యుల సేవలు**

ఈ మెగా వైద్య శిబిరంలో గుండె, క్యాన్సర్, ఆర్థోపెడిక్, కంటి సంబంధిత విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ అర్పిత ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రామారావు గుండె సంబంధిత పరీక్షలు చేశారు. ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జీబీఎస్ రాహుల్ రెడ్డి ఎముకలు, కీళ్ల సమస్యలపై వైద్య సేవలు అందించగా, క్యాన్సర్ వైద్య నిపుణులు



డాక్టర్ తేజస్విని క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ఈసీజీ, ఈకో, బీపీ, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు తదుపరి చికిత్సకు మార్గదర్శకాలు అందించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ప్రజలకు ఆరోగ్య సలహాలు ఇవ్వడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

**భారీగా తరలివచ్చిన ప్రజలు....**

పర్చూరు నియోజకవర్గం వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం నుంచే శిబిర ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసిపోయింది. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం విశేషం.

**ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటూ...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ సినీ రంగంలో మహానటుడిగా, రాజకీయాల్లో ప్రజానాయకుడిగా ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రజలకు



ఉపయోగపడే విధంగా ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

**ముఖ్య అతిథుల హాజరు...**

ఈ కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ షమీమ్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ శంషుద్దీన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోడూరి శేష బ్రహ్మాచారి, రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు,తెలుగుదేశం పార్టీ నేతలు కొల్లా శ్రీనివాసరావు, కొల్లా చంద్రం,తారక రామారావు, పర్చూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, పాలేరు రామకృష్ణ, బంగారు బాబు, విన్నకోట సతీష్, కోటేశ్వరరావు, మామిడిపాక హరిప్రసాద్, కోరిటాల సురేష్, కొమ్మలపాటి సురేష్, అప్పలనేని నరేంద్ర, బేతపూడి సురేష్, గోరంట్ల రామకృష్ణ, సుమన్, పోపూరి శ్రీనివాసరావు, వినయ్ కుమార్, కామేపల్లి హరిబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, డాక్టర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు డెడికేటెడ్ కమిషన్

## కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా


(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 26)

రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించేందుకు అవసరమైన అంచనా వేయడం కోసం డెడికేటెడ్ కమిషన్ కృషి చేస్తోందని కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ల పై అధ్యయనం, వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా కలెక్టర్ పి రాజాబాబుతో కలసి ఉమ్మడి ప్రకాశం జిల్లాపరిషత్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి యూనిట్‌కు సంబంధించిన బీసీ జనాభా శాతం, రిజర్వేషన్ పరిమితుల పై కమిషన్ సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా ఏకీకృత కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) సమగ్రంగా నిర్వహించి, ఖచ్చితమైన సమాచారం సేకరించాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల అమలుకు ఈ సమాచారం ఎంతో కీలకమని తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో బిసి కులాలకు సంబంధించి సేకరించే డేటా మ్యాపింగ్ పక్కాగా జరగాలని, తారతమ్యాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ ఆదేశించారు. ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేస్తూ సెన్సస్ ప్రక్రియలో కూడా బిసి కులాలకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించుకోవాలని సూచించారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల ద్వారా జరిగే సర్వే ప్రక్రియలను పూర్తిగా పరిశీలిస్తూ సంబంధిత సమాచారాన్ని పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ విభాగాలు సరి చూసుకోవాలని చెప్పారు. గత ఎన్నికల్లో బిసి వర్గాలకు కేటాయించిన సీట్లు, మొత్తం సీట్లలో వారి ప్రాతినిధ్యం నిష్పత్తి వివరాలు సేకరించి కమిషన్ కు అందజేయాలన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తయింది అనేది మాత్రమే ముఖ్యం కాదని, సర్వే ఖచ్చితత్వంగా ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే ఆ డేటాను కమిషన్ విశ్వసనీయంగా ఉపయోగించుకోగలదని చైర్మన్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమయానికి నిర్వహించడం రాష్ట్రానికి అత్యంత కీలకం అన్నారు. 16వ ఆర్థిక సంఘం గ్రాంట్ల విడుదలకు ఎన్నికలు తప్పనిసరి అన్నారు. జనాభా వివరాలు, ఓటర్ల సంఖ్య, బీసీ ఓటర్ల నిష్పత్తి వంటి అంశాలను పరిశీలిస్తూ సంబంధిత వివరాలను క్రాస్ చెక్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ పేర్కొన్నారు. కుల సంఘాల ప్రతినిధులు వ్యక్తం చేస్తున్న సమస్యలను ఓపికగా విని, వాటిలో కమిషన్ పరిధిలో ఉన్న అంశాలను నమోదు చేసి పరిశీలిస్తున్నామని తెలిపారు. కమిషన్ పరిధిలోకి నేరుగా రాని అంశాలు వచ్చినప్పటికీ, ప్రజల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునే దిశగా వాటిని కూడా రికార్డులో పొందుపరుస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు, డిమాండ్లను స్వయంగా విన్నప్పుడే వాస్తవ పరిస్థితులు పూర్తిగా అర్థమవుతాయని పేర్కొంటూ, అందరితో సంప్రదింపులు జరుపుతూ పారదర్శక విధానంలో కమిషన్ పని కొనసాగుతోందన్నారు. బీసీలకు సంబంధించిన సమగ్ర, ఖచ్చితమైన డేటాను అందించాలని చైర్మన్ అధికారులకు సూచించారు. వివిధ ప్రభుత్వ పథకాలలో బీసీల కవరేజీపై సమగ్ర సమాచారం అవసరమని చైర్మన్ పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీలు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారు, వారి విద్యాస్థాయి, సామాజిక-ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయనే విషయాలపై గుణాత్మక నివేదిక (క్వాలిటేటివ్ రిపోర్ట్) కూడా ఉపయోగకరంగా ఉంటుందని చైర్మన్ అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ శ్రీ పి రాజాబాబు మాట్లాడుతూ, జిల్లాలో ఏకీకృత కుటుంబ సర్వే సమగ్రంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి మండలానికి ప్రత్యేక అధికారిని భాధ్యులుగా నియమించి, ఏకీకృత కుటుంబ సర్వే పర్యవేక్షించడం జరిగిందన్నారు. నాణ్యమైన సర్వేకు అవసరమైన ఖచ్చిత సమాచారం సేకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా జనాభా గణాంకాలు, బీసీ వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలపై కమిషన్ కు సమగ్ర వివరాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీవారీగా సీట్ల సంఖ్య, అందులో గత ఎన్నికలలో బీసీ వర్గాల ప్రాతినిధ్యం, సీట్లు వివరాలను సంబంధిత అధికారులు కమిషన్ కు సవివరంగా తెలియజేసారు. అనంతరం ప్రజల నుంచి, సంఘాల ప్రతినిధుల నుంచి చైర్మన్ వినతులు స్వీకరించడంతో పాటు వారి అభిప్రాయాలు, సమస్యలను స్వయంగా విని నమోదు చేసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, వినతులను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డెడికేటెడ్ కమిషన్ సెక్రటరీ డి చంద్రశేఖర్‌రాజు, జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి, సిపిఒ శ్రీనివాసులురెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, డిఎల్డిఓలు, జిఎస్ డబ్ల్యుఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 26)

ముండ్లమూరి వారి పాలెం, పొన్నలూరు మండలం ముండ్లమూరి వారి పాలెం గ్రామంలో పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం జరిగింది. ఆలయ అర్చకులు, టీటీడీ వేద పండితులు పరుచూరి సీతారామాచార్యులు, నారాయణ అవినాష్ స్వామి, ఫణీంద్ర స్వాములు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, ఎంతో వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను కన్నుల పండుగగా అలంకరించారు. ఇప్పగుంట కాంతారావు దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు, వీరితో పాటు ఇప్పగుంట శ్రీకాంత్ దంపతులు, వారి సోదరులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఐదవ రోజు గ్రామంలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. సాయంత్రం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. హనుమంత వాహనంపై సీతారామ చంద్రుల గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి ముందు వసంతోత్సవం కోలాహలంగా జరిగింది. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో వేలాదిమందికి అన్న ప్రసాద వినియోగం జరిగింది.

# మెగా డీఎస్సీ పై వైసీపీ విషప్రచారం

### లోకేష్ కు మంచి పేరొస్తుందని బురద జల్లుతూ ఫేక్ పార్టీ కుట్రలు
### 'చిన్నప్పన్న' అరెస్టుతో దందాల డొంక కదిలింది
### గొడ్డలి పార్టీ బండారం బట్టబయలు
### మహానాడుతో టీడీపీ జోష్
### మండుటెండల్లోనూ శ్రేణుల పరుగులు
### గోగినేని రామారావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

"నా తెలుగుదేశం - నా బాధ్యత" నినాదంతో తెలుగువారి పండుగ మహానాడును ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు మహానాడును విజయవంతం చేయడానికి ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు . గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించడంతో పాటు, రాబోయే మూడు సంవత్సరాలకు దిశానిర్దేశం చేసే వేదికగా ఈ మహానాడు నిలుస్తుంది.మెగా డీఎస్సీ--2025ను పారదర్శకంగా నిర్వహిస్తుంటే వైసీపీ సోషల్ మీడియాలో ఫేక్ ట్వీట్లు, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని గోగినేని రామారావు మండిపడ్డారు. మంత్రి నారా లోకేష్ కు వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. నిరుద్యోగులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా ఇప్పుడు టీచర్లను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఉపాధ్యాయ సమాజాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను ."తాడేపల్లి ప్యాలెస్‌లో మొద్దునిద్రపోయిన వారు ఇప్పుడు స్వార్థ రాజకీయాల కోసం ఫేక్ ట్వీట్లతో విషప్రచారం చేస్తున్నారు" అంటూ వైసీపీ నాయకత్వంపై రామారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు కోర్టుల్లో 220కి పైగా కేసులు వేసినా, కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గలేదన్నారు. కేవలం 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చి, 22 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుండటాన్ని వైసీపీ తట్టుకోలేక ఇలాంటి కుట్రలకు దిగుతోందని ఆరోపించారు.వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై కూడా గోగినేని రామారావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీతో మొదలైన అరాచకాల చరిత్ర ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతోందన్నారు. "గొడ్డలి పార్టీ" నేతల దందాలు ప్రజల ముందుకు వస్తున్నాయని, ముఖ్యంగా పీఏ చిన్నప్పన్న వ్యవహారంలో వందల కోట్ల అక్రమాలు బయటపడుతున్నాయని తెలిపారు. విచారణలో ప్రజలు విస్తుపోయేలా భారీ ఆస్తుల వివరాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని వందల, వేల కోట్లు అక్రమంగా దోచుకున్న వారు ప్రజాప్రతినిధుల ముసుగులో తిరిగారని, ఇప్పుడు వారి అసలు రూపం బయటపడుతోందని గోగినేని రామారావు విమర్శించారు. 2004 నుంచి సాగుతున్న అక్రమ దందాలు "చిన్నప్పన్న" అరెస్టుతో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని సంచలన విషయాలు బయటపడతాయని హెచ్చరించారు.

# కరాటే విద్య క్రమ శిక్షణకు మార్గం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 26)

పొదిలి డాక్టర్ రాజు కరాటే సెంటర్ నందు (జూనియర్ కాలేజ్) బెల్ట్ టెస్ట్ పోటీలు, స్పారింగ్ పోటీలు, గుండెల పై సమ్మెటతో బండలు పగులుగొట్టడం మొదలు కార్యక్రమాలు జరిగాయి. జె హన్విక, చి మన్విత్ రాజ్దీప్ గుండెల పై బండలు సమ్మెటతో కొట్టించుకున్న ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. చిన్నారులను అందరూ మెచ్చుకున్నారు. కలర్ బెల్ట్ టెస్ట్ పోటీలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ షేక్ షమ్మా, వాత్సల్య, వశిష్ట, షాజియా, దీపక్, పార్థు, కౌశిక్, జైన్, వాజితారెడ్డి, ఖదీర్, మూర్తి, ముల్ల ఇమ్రాన్ వారి వారి బెల్టు విభాగాలలో బెల్ట్ టెస్ట్ విజేతలుగా నిలిచారు. స్పారింగ్ పోటీలలో జే. హన్విక, వాత్సల్య, షాజియా విజేతలుగా నిలిచారు. బాలుర విభాగంలో కౌశిక్ దీపక్ పార్థు గెలిచారు. ఈ విధంగా జరిగిన అభినందన సభకు ముఖ్య అతిథిగా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కె వాసుదేవ్ విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగినది. కరాటే విద్య నేటి కాలంలో ఆరోగ్యరీత్యా అందరికి అవసరం అని కరాటే విద్య క్రమశిక్షణకు మార్గమని కరాటే మాస్టర్ చినరాజును ప్రత్యేకంగా అభినందించారు. కరాటే మాస్టర్ చిన్నరాజు, విద్యార్థులు కరాటే విద్యను ప్రోత్సహిస్తున్న జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కె వాసుదేవ్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





# బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల పోలీసులు ప్రత్యేక నిఘా

## మూగజీవాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం
## 53 ప్రత్యేక బృందాల ఏర్పాటు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 26)
రాబోవు బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో ఎటువంటి మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులు జరగకుండా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల స్థాయిలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి శ్రీధర్‌ని నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. పోలీసు, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ మరియు ఇతర సంబంధిత శాఖలతో కలిసి ప్రత్యేక ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటుచేసి జిల్లావ్యాప్తంగా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, టోల్ గేట్స్, ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పద వాహనాలను పూర్తిగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా మూగజీవాలను తరలించడం, అనుమతులు లేకుండా రవాణా చేయడం, జంతు హింసకు పాల్పడడం లేదా నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ప్రభుత్వ నిబంధనలు, కోర్టు మార్గదర్శకాలు, జంతు సంరక్షణ చట్టాలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలు, సామాజిక సామరస్యం దెబ్బతినే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి, అనుమానాస్పద రవాణా లేదా అక్రమ కార్యకలాపాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. పోలీసు వారికి సమాచారం ఇవ్వకుండా చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకుని భౌతికదాడులకు పాల్పడితే అలాంటి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రకాశం,



మార్కాపురం జిల్లాల్లో ప్రతి మండలానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు మొత్తం 53 ప్రత్యేక బృందాలను నియమించడం జరిగింది. అదనంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు.గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందినప్పుడు పశు సంరక్షణ కార్యకర్తలు పోలీసులతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారానే వెళ్లి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జాయింట్ యాక్షన్ టీమ్‌లతో పాటు నిరంతరం పోలీసు పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో మూగజీవాల వధ జరిగిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మత సామరస్యానికి భంగం కలగకుండా పండుగలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కమ్యూనల్ సెన్సిటివ్ ప్రాంతాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, ప్రజల సహకారం తీసుకోవాలని, ముఖ్యమైన మసీదులు, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేయాలని, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచి, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, డ్రోన్ కెమెరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. సంతలు, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహన తనిఖీలు నిర్వహించాలని, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని చట్టపరమైన మార్గదర్శకాలను అమలు చేయాలని, పండుగ ప్రశాంతంగా జరిగేలా బందోబస్తును ఏర్పాటు చేస్తుకోవాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు.గోవధ, పశువుల అక్రమ రవాణా పై ఏదైనా సమాచారమును పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ - 9121102266, 9121102242, డయల్ -112, 100, నోడల్ ఆఫీసర్ ఫోన్ నెంబర్:9121102116 తెలియచేయాలి. సమాచారం ఇచ్చిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

# ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### బీసీ డీ నుండి బీసీ ఏ జాబితాలో చేర్చాలి
### డెడికేటెడ్ కమిషన్‌కు వినతి పత్రం అందజేసిన ఏపి ముదిరాజ్ మహాసభ ప్రకాశం జిల్లా అధ్యక్షులు చంబళ్ల అయ్యప్ప స్వామి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)
ముదిరాజ్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రకాశం జిల్లా అధ్యక్షులు చంబళ్ల అయ్యప్ప స్వామి ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఒంగోలులో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన చంబళ్ల అయ్యప్ప స్వామి ముదిరాజ్ ముదిరాజ్ కులస్తులను బీసీ డీ కేటగిరి నుండి బీసీ ఏ క్యాటగిరిలో మార్చాలని కోరారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఉపసంహరించాలి

### సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)
పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగరకమిటి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. నగరంలో భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం, మంగమూరు డొంక వద్ద పార్టీ నగర నాయకులు బి.వి.రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరుసగా నాలుగోసారి పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని తీవ్రంగా మండిపడ్డారు . ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ఒక్క రూపాయి కూడా పెంచని ప్రభుత్వం, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గ్యాస్ సిలిండర్ ధరల పెంపుతో భారాల మోత ప్రారంభించిందన్నారు. తాజాగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రావడంతో ప్రజలపై మరింత భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ స్థానిక నాయకులు ఎస్.డి.హుస్సేన్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ఆటో కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, డ్రైవర్లు సహా అనేక వర్గాల జీవన పరిస్థితులు దెబ్బతింటాయని తెలిపారు. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందన్నారు. రోజువారీ కూలీ పై ఆధారపడే పేదల పై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షాన ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి దాసు, కే గురవయ్య, ఎస్కె జబ్బార్, జి రామకృష్ణ, మాలకొండయ్య, సురేష్, పి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి మువ్వా రంగ సాయి యాదవ్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 26)
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు 27, 28 తేదీలలో నిర్వహించే పసుపు పండుగ, మహానాడు 2026 కార్యక్రమం హైబ్రిడ్ విధానంలో మండలంలోని స్థానిక పార్టీ కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో ఎల్ఈడీ స్క్రీన్‌ల మీద నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున 23 పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, రాష్ట్ర,జిల్లా నియోజకవర్గ, మండల నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా నాయకులు, కేఎస్ఎస్ సభ్యులు అందరూ తప్పకుండా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి, ఉమ్మనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు మువ్వా రంగ సాయి యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

## విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)
రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారెడ్డి సూచనల మేరకు వేసవి కాలంలో ఏర్పడిన అధిక ఉష్ణోగ్రతలు, ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షపాతం సందర్భంగా ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాల పట్ల జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు జిల్లా విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేసారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని అనంతరం విద్యుత్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యుత్ సిబ్బంది అందరు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని, అన్ని డివిజన్లలో కూడా కంట్రోల్ రూమ్ పెట్టాలని ఆదేశాలిచ్చారు. అలాగే ప్రజలందరూ పలు సూచనలు పాటించాలని ఆయన కోరారు. అవసరం లేని చోట ఫ్యాన్స్, లైట్లు, ఏసిలు తదితర విద్యుత్ ఉపకరణాలను ఆఫ్ చేసి ప్రజలు విద్యుత్ పొదుపుగా వాడాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ట్రాన్స్ ఫార్మర్ల సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయన్నారు. అక్కడక్కడ గాలి, వర్షాలకు తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈదురు గాలుల కారణంగా పలు చోట్ల సమస్యలు తలెత్తినా విద్యుత్ సిబ్బంది వెంటనే అధిక ఉష్ణోగ్రతలోనూ ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తునారని తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్ కాలిపోతే వెంటనే పునరుద్ధరణ చేస్తున్నామన్నారు. ఎక్కడికక్కడ ట్రాన్స్ ఫార్మర్లు సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 ట్రోల్ ఫ్రీ నెంబర్, ఎల్ఎంసీ నంబర్ 9440817491కి ఫోన్ చేసి తెలపాలని లేదా సంబంధిత లైన్ మెన్ కి గాని సంబంధిత సబ్‌స్టేషన్ కి గాని వెంటనే తెలియజేయాలని కోరారు.

**కంట్రోల్ రూమ్ నెంబర్లు ఇవే...**

| | |
|---|---|
| ఎస్ఈ కార్యాలయం కంట్రోల్ రూమ్ | : 9440817491 |
| ఎస్ఈ ప్రకాశం | : 9440811748 |
| ఒంగోలు డివిజన్ కంట్రోల్ రూమ్ | : 9440817495 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఒంగోలు | : 9440812195 |
| కందూకూరు డివిజన్ కంట్రోల్ రూమ్ | : 9491052950 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కందూకూరు | :9493174270 |
| అద్దంకి డివిజన్ కంట్రోల్ రూమ్ | :9490611613 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అద్దంకి | :9490611615 |
| దర్శి డివిజన్ కంట్రోల్ రూమ్ | :9491065264 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, దర్శి | :9491082095 |
| కనిగిరి డివిజన్ కంట్రోల్ రూమ్ | :9705759835 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కనిగిరి | :9440812197 |
| మార్కాపురం డివిజన్ కంట్రోల్ రూమ్ | :9440817509 |
| ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, మార్కాపురం | :9440812196 |

# గాండ్ల తెలికుల ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)
ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ చైర్మన్ ను కలసిన గాండ్ల సంఘ నాయకులు ఒంగోలు పట్టణంలోని స్పందన హాల్ నందు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘాల చైర్మన్, డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ప్రకాశం, మార్కాపురం జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు హాజరై గాండ్ల తెలికుల ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి ఒక కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, గాండ్ల తెలికుల సామాజికవర్గంలోని నిరుద్యోగ యువకులు గానుగలు ఏర్పాటు చేసుకొనుటకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని, 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటును ప్రభుత్వం అందించాలని, రాజకీయ సామాజిక సమగ్ర అభివృద్ధి కోసం బీసీలకు అందించే రాజకీయ రిజర్వేషన్లలో గాండ్ల తెలికుల కులస్తులకు సముచిత వాటాను కల్పించాలని కమిషన్‌ను కోరారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛమైన గానుగ నూనెలు కల్తీ నూనెలు కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని దీనికిగాను విరివిగా గానుగలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తే స్వచ్ఛమైన నాణ్యమైన నూనె ప్రజలకు అందించగలమని గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి వరికుంట్ల వెంకటేశ్వర్లు, మార్కాపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, దాసరి గురుస్వామి, ప్రకాశం జిల్లా యువజన కన్వీనర్ బోయిళ్ళ రోషన్ బాబు, రాష్ట్ర నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసులు, తంగెళ్ల నాగభూషణం, స్థానిక నాయకులు ఊటుకూరి ప్రసాద్, వరికుంట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# వరస చోరీలు

## మహిళా మెడలో బంగారు గొలుసు అపహరణ

### బిరుదుల నరవ గ్రామంలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సిఐ అవుట్ ఆఫ్ హుస్సేన్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 26)
మార్కాపురం మండలంలోని బిరుదులనరవ గ్రామములో ఇంటి వరండాలో నిద్రిస్తున్న విప్పర్ల రవణమ్మ అనే మహిళ మెడలో ని బంగారు గొలుసు ను సోమవారం అర్ధరాత్రి దొంగలు అపహరించుకొని వెళ్ళారు. చోరీకి గురైన బంగారు గొలు మూడున్నర తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత వారం రోజుల నుండి మార్కాపురం జిల్లాలో వరుస చోరీలకు దొంగలు పాల్పడుతున్నారు. బిరుదుల నరవా గ్రామంలో బాధితురాలు ఇంటి వద్ద ఘటనా స్థలానికి చేరుకొని మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, గ్రామీణ ఎస్ఐ వేమనలు వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మహానాడుకు ముస్తాబైన వినుకొండ

## వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

## ప్రతి గ్రామం నుండి తరలిరావాలని పిలుపు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 26)

తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, స్వర్గీయ నందమూరి తారకరామారావు ఉన్నత ఆశయాల సాధనే ధ్యేయంగా... పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర విజన్ 2047' స్వప్నాన్ని సాకారం చేసే దిశగా మే 27, 28 తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగబోయే మహానాడుకు వినుకొండ నియోజకవర్గం సర్వసన్నద్ధమైంది. పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ నేతృత్వంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరగనున్న ఈ మహానాడు పండుగ ఏర్పాట్లను ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు స్వయంగా పర్యవేక్షించారు. నియోజకవర్గవ్యాప్తంగా పసుపు జెండాలు, ప్రచార పటాలు, తోరణాలతో మహానాడు ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశామని, తరలివచ్చే కార్యకర్తలకు, అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులతో పాటు ప్రత్యేక భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... నాడు అన్నగారు వేసిన బలమైన పునాది, నేడు చంద్రబాబు నాయుడు చూపిస్తున్న ప్రగతి బాట, రేపటి తరం భవిష్యత్తు కోసం లోకేష్ బాబు పడుతున్న తపనను గుండెల్లో నింపుకుని వినుకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుండి పసుపు సైన్యం భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమస్యల అధిగమనానికి సాంకేతికతను జోడించి అంతర్జాలం ద్వారా నిర్వహిస్తున్న ఈ మహానాడు కోసం నియోజకవర్గ పరిధిలో మొత్తం 13 క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా మండలాల పరిధిలోని ముఖ్య స్థలాలలో ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన వివరించారు. ఈ మహానాడు వేదికగా ఏర్పాటు చేసిన క్లస్టర్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి అంశాలపై విస్తృతంగా చర్చించి తీర్మానాలను ఆమోదిస్తారని, ఆ తీర్మానాలను రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకువెళతారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర, జాతీయ పార్టీ నాయకత్వం చేసే దిశా నిర్దేశక ప్రసంగాలను స్పష్టంగా వీక్షించేందుకు ఆయా క్లస్టర్ల మహానాడు



వేదికల వద్ద భారీ తెరలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత తీవ్ర వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హాజరయ్యే కార్యకర్తలకు, అభిమానులకు తాగునీరు, చల్లదనం, నివాస వసతి వంటి ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. మహానాడు జరిగే వేదికల వద్ద రక్షక భటుల పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎక్కడా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు అత్యవసర సేవల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి వేదిక వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను, అత్యవసర చికిత్స వాహన సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ మహానాడు ప్రతిష్టాత్మక సమావేశాల నిర్వహణలో భాగంగా బొల్లాపల్లి మండలంలో క్లస్టర్-1 మేళ్లవాగు లక్ష్మీ సరస్వతి పాఠశాల, క్లస్టర్-2 గుట్లపల్లి సచివాలయం ఎదురు, క్లస్టర్-3 బొల్లాపల్లి గ్రామం, ఈపూరు మండలంలో క్లస్టర్-4 ముప్పాళ్ల కల్యాణమండపం, క్లస్టర్-5 ఈపూరు కల్యాణమండపం వేదికలుగా నిలిచాయి. అలాగే శావల్యాపురం మండలంలో క్లస్టర్-6 నరసరావుపేట రహదారి శివశక్తి అతిథి గృహం, క్లస్టర్-7 బొందిలిపాలెం అమ్మవారి దేవాలయం వద్ద, వినుకొండ మండలంలో క్లస్టర్-8 నరసరావుపేట రహదారి కేజీఎల్ కళ్యాణ వేదిక, క్లస్టర్-9 ఏనుగుపాలెం రహదారి శారదాంబ కళ్యాణ వేదికలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వినుకొండ పట్టణ పరిధిలో క్లస్టర్-10 గంగినేని కళ్యాణ వేదిక, క్లస్టర్-11 కేఎస్ కళ్యాణ వేదిక, నూజెండ్ల మండలంలో క్లస్టర్-12 ఐనవోలు గ్రామం, క్లస్టర్-13 జెనిత్ పాఠశాల వద్ద ఈ అంతర్జాల సమావేశాలు జరగనున్నాయి. ఈ చారిత్రాత్మక పసుపు పండుగలో తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అందరూ పెద్ద ఎత్తున భాగస్వాములై విజయవంతం చేయాలని, క్రమశిక్షణతో కూడిన పసుపు సైన్యం సత్తాను ప్రపంచానికి చాటిచెప్పాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హృదయపూర్వకంగా పిలుపునిచ్చారు.

# బడి ఈడులో ఉండే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదో ఒక పాఠశాలలో అడ్మిట్ కావాలి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 26)

బడి ఈడు లో ఉండే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదో ఒక పాఠశాలలో అడ్మిట్ కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మార్కాపురం కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలు ఏవి కూడా ఎండాకాలం సెలవుల్లో ఎలాంటి తరగతుల నిర్వహించరాదన్నారు. అలా నిర్వహించిన పాఠశాలల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలలు స్టూడెంట్ రిక్వెస్ట్‌లను అకారణంగా తిరస్కరించరారదన్నారు. ఫీజుల పేరుతో టీసీలు, మార్క్‌లిస్ట్‌లు ఆపడం చేయరాదన్నారు. ప్రభుత్వ విధివిధానాలను తప్పకుండా పాటించాలని సూచించారు.

# వేసవిలో పశువులు జరభద్రం

## రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి

## అధిక ఉష్ణోగ్రతలతో పశువులకు వడదెబ్బ ప్రమాదం

## మండల పశువైద్యాధికారి డాక్టర్ రాంబాబు సూచనలు



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 26)

ప్రస్తుతం రోహిణి కార్తె ప్రభావంతో మండలంలో ఎండలు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో పశువుల పోషకులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రాంబాబు సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశమున్నందున రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. వేసవి కాలంలో సరైన సంరక్షణ లేకపోతే పశువులకు వడదెబ్బ తగిలి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.పశువులను ఉదయం 6 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే మేతకు తీసుకెళ్లాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆ సమయంలో పశువులను బయటకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పశువులను చెట్ల నీడలో లేదా గాలి ఆడే ప్రదేశాల్లో ఉంచడం వల్ల వేడి ప్రభావం తగ్గుతుందని చెప్పారు. ముఖ్యంగా చూడి పశువులు, పాలిచ్చే ఆవులు, లేగదూడలు అధిక ఉష్ణోగ్రతలకు త్వరగా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు.పశువులపై గోనెపట్టలు ఉంచి వాటిని తరచూ నీటితో తడపడం ద్వారా శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుందని డాక్టర్ రాంబాబు వివరించారు. పశువులకు ఎప్పటికప్పుడు శుభ్రమైన చల్లటి నీరు అందుబాటులో ఉంచాలని రైతులకు సూచించారు. వేసవి కాలంలో పచ్చిమేత కొరత ఏర్పడే అవకాశముండటంతో పోషకాహారం సమృద్ధిగా అందించాలని తెలిపారు. అలాగే పశువుల కొట్టాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు.పశువులు అలసటగా ఉండటం, ఆహారం తీసుకోకపోవడం, నోటి నుంచి నురుగు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే తమను సంప్రదించాలని రైతులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తనతోపాటు సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు.రైతుల సంక్షేమం, పశుసంరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న డాక్టర్ రాంబాబు, ప్రతి రైతు వేసవిలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.

# గోవధ నిషేధ చట్టాలను అమలు చేసి గోవధను అరికట్టాలి






(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 26)

గోవధ నిషేధ చట్టాలను అమలుపరిచి గోవధను, బహిరంగ జంతు వధను అరికట్టాలని నినదిస్తూ విశ్వహిందూ పరిషత్ తదితర హిందూ ధార్మిక సంస్థలు భారీ ర్యాలీని చేపట్టి వినుకొండ తహసిల్దార్, మునిసిపల్ కమిషనర్, పట్టణ సీఐలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వేద కాలం నుండి నేటి ఆధునిక విజ్ఞానవంతుల వరకు గోమాతను సకల దేవతా స్వరూపంగా, గోవు,గో ఉత్పత్తులు ప్రకృతికి, మానవాళికి ఎంతో ఉపయోగపడే దేవతగా గుర్తించారన్నారు. అట్టి గోమాతను వధించటం, బహిరంగ జంతు వధ కూడా చట్టరీత్యా నేరం. గోవధ, జంతువధ లను నేరంగా పరిగణిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 1977 లోనే చేసిన చట్టం ఇప్పుడూ అమలులోనే ఉందన్నారు. కానీ వినుకొండ లోని కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా ఓబయ్య కాలనీలో జరుగుతున్న గోవుల, జంతువుల బహిరంగ వధకు సంబంధించిన ఫోటోలు, వీడియో ఆధారాలతో వినుకొండ పోలీసు, మున్సిపల్ అథారిటీ వారికి ఈ నెల 17న ఫిర్యాదు చేసినప్పటికీ అదే స్థలంలో నిర్భయంగా గోవధ, గో మాంస అమ్మకాలు యధావిధిగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల 13.05.26న ప్రభుత్వం వారు రాబోవు బక్రీద్ సందర్భంగా కూడా ఎటువంటి గోవధ, బహిరంగ జంతువధ జరగకూడదని అన్ని ప్రభుత్వ శాఖల వారికి సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. నగరం నడిబొడ్డున అపరిశుభ్రమైన, దుర్వాసనతో కూడిన జుగుప్సాకరమైన మానవత్వానికి కళంకమైన ఇట్టి చర్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కనుక ప్రభుత్వ ఉత్తర్వులను అమలుపరచాలని ఈ కార్యక్రమాలను అరికట్టాలని కోరుతూ స్థానిక శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానం నుండి గోవులను రక్షించాలని నినదిస్తూ, ప్లే కార్డులతో ర్యాలీగా అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అధికారులు సత్వరమే తగు చర్యలు తీసుకొని ఈ గోవధను అరికడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, దేవాలయ కమిటీల, సత్సంగాల సభ్యులు మహిళలు తదితర హిందూ ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



# సెలవు దినం 28వ తేదీకి మార్పు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఈ నెల 27వ తేదీ బక్రీద్ పండుగ సందర్భంగా సెలవు దినం ను 28వ తేదీకి మార్చడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్ వి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఒంగోలు నందు ప్రీ లిటిగేషన్ కేసులు వేసిన ఫిర్యాదుదారులు, ప్రతివాదులు 29వ తేదీ శుక్రవారం రోజున విచారణ జరుగుతుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు పెండింగ్లో ఉన్న వ్యాజ్యాలలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ అంశాన్ని గమనించాలని కోరారు.

# జర్నలిస్ట్ కాలనీ రెండవ లైన్‌లో మరియమ్మ ప్రభుత్వ భూమి ఆక్రమణ

## నా పై ఆరోపణలు చేస్తుంది

## మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అజీమునిషా ఆవేదన







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

జర్నలిస్ట్ కాలనీ రెండవ లైన్ లో ప్రభుత్వ భూమిని మరియమ్మ ఆక్రమించి, తనపై ఆరోపణలు చేస్తుందని మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అజీమునిషా ఆవేదన వ్యక్తం చేశారుఒంగోలు జర్నలిస్ట్ కాలనీ రెండో లైన్ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించిన మరియమ్మకు ఆ స్థలానికి ఎటువంటి సంబంధం లేదని గత ప్రభుత్వంలో మరియమ్మ ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించింది అని దానిని మున్సిపల్ అధికారులు తొలగించడం జరిగిందని దానికి నాకు ఎటువంటి సంబంధం లేదని టిడిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అజీమునిషా తెలియజేసింది.. తన కుటుంబంపై కక్షకట్టుకొని మరియమ్మ తనపై తప్పుడు ఆరోపణ చేస్తుందని తెలిపింది.. ఆ స్థలం రేకుల షెడ్ తొలగించిన దానికి నాకు ఎటువంటి సంబంధం లేదని కావాలని తనను ఇందులో ఇరికిస్తుందని తెలిపింది.. 2014 తెలుగుదేశం ప్రభుత్వంలో టిడిపిలో చేరిందని అప్పుడు ఆమెకు తను ఆశ్రమించి అన్నం పెట్టానని ఆ విశ్వాసం కూడా లేకుండా తన కుటుంబంపై అక్రమ కేసులు పెడుతుందని తర్వాత 2019లో వైసీపీ లో చేరి ఇందిరమ్మ కాలనీ జర్నలిస్ట్ కాలనీలో సుమారు పది స్థలాలు ఆక్రమించి అనేకమందిపై తప్పుడు కేసులు పెట్టించి చాలామందిని బాధ పెట్టిందని ఆమె తెలియజేసింది. మరియమ్మ ఆక్రమించిన స్థలం బాధితురాలు మాట్లాడుతూ 2014లో తెలుగుదేశం ప్రభుత్వంలో తమ కుటుంబానికి స్థలాలు ఇప్పించిందని తరువాత ఆమెకు తెలియకుండా ఆ స్థలాన్ని అక్రమంగా అమ్మేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె మరియమ్మను ప్రశ్నించగా ఆమె తిరిగి తమపైనే కేసులు పెట్టించి బాధపెడుతుందని ఆమె ఏడుస్తూ కన్నీళ్లు పెట్టుకోంది. మరియమ్మ ఆక్రమించిన వారి స్థలాలు ఇప్పించాలని ఆమె కోరింది.

# అనధికార లేఅవుట్‌ల పై తనిఖీ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

ఆంధ్ర ప్రదేశ్ పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ సంచాలకులు, వైస్ చైర్‌పర్సన్ ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారి ఆదేశాల మేరకు ఒంగోలు పట్టణాబివృద్ధి సంస్థ ఓడా(ఓఎన్‌యుడీఏ) పరిధిలోని అనధికార లే-అవుట్ల పై మంగళవారం సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అక్రమ లేఅవుట్ల నియంత్రణలో భాగంగా డీటీసీపీ, ఆర్‌డీడీటీపీ అధికారులు 10 బృందాలుగా ఏర్పడి తొలి విడతగా ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని కొత్తపట్టణం, ఒంగోలు, శింగరాయకొండ, కనిగిరి, దర్శి, వేటపాలెం, మార్టూరు మండలాల్లో పర్యటించి మొత్తం 101.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 25 అనధికార లేఅవుట్లు గుర్తించారు. ఏపీఎంఆర్‌యుడీఏ చట్టం 2016 నిబంధనల ప్రకారం సదరు అనధికార లేఔట్‌లను తొలగించారు. ఈ సందర్భంగా ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్‌పర్సన్ కల్పనా కుమారి మాట్లాడుతూ ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని ప్రజలకు పలు సూచనలు చేసారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయరాదన్నారు. అటువంటి అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. అలాగే బ్యాంకులు, ఆర్థిక సంస్థలచే రుణాలు కూడా మంజూరు చేయబడవు. అదనంగా, యాజమాన్య వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇతర న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అనధికార లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లకు ప్రభుత్వ మౌలిక సదుపాయాలు లేదా భవన నిర్మాణ అనుమతులు లభించవు. అటువంటి లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపడితే అవి అక్రమ నిర్మాణాలుగా పరిగణించి, ఎపిఎంఆర్, యుడిఏ చట్టం 2016 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడును. కాబట్టి ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు పొందిన ఏపీఆర్ఈఆర్ఏ నమోదు చేయబడిన లేఅవుట్లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని తెలియజేయడమైనది. ఇటీవల లేఅవుట్ రెగ్యులేషన, స్కీం ద్వారా అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుటకు ప్రభుత్వం 23.04.2026 వరకు అవకాశం కల్పించగా, అనేక మంది ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో ఉడా సిబ్బంది, వివిధ పురపాలక సంఘాలకు చెందిన పట్టణ ప్రణాళికా అధికారులు పాల్గొన్నారు.

## 33కేవీ తెట్టు ఫీడర్‌లో పాత కండక్టర్ మార్పిడి పనుల పరిశీలన

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 26)





33కేవీ తెట్టు ఫీడర్‌లో పాత కండక్టర్ మార్పిడి పనులను ఏపీసీపీడీసీఎల్ (ప్రాజెక్ట్స్) డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ పనులు కీలకమని తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. పనుల పురోగతి, సాంకేతిక అంశాల పై అధికారులను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇంజనీర్లు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# "మహానాడు" పండుగకు ముస్తాబు

**ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో క్లస్టర్ల పరిధిలో భారీ ఏర్పాట్లు**
**హాజరుకానున్న కేఎస్ఎస్, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జులు, తెలుగు తమ్ముళ్లు**
**పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్న మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు**
**ఎల్ఈడి స్క్రీన్లు, భోజన సదుపాయాలతో సందడి**
**పసుపు జెండాలు, తోరణాలతో కళకళలాడనున్న వేడుక ప్రాంగణాలు**
**క్యాంప్ కార్యాలయంలో వేడుకలకు హాజరుకానున్న ఎమ్మెల్యే ఏలూరి**

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 26)

తెలుగుదేశం పార్టీ మహానాడు వేడుకలను పురస్కరించుకుని పర్చూరు నియోజకవర్గం వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఆరు మండలాల పరిధిలోని 12 క్లస్టర్లలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలు జారీ చేయడంతో పార్టీ శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. మహానాడు కార్యక్రమాలకు తెలుగు తమ్ముళ్లు, కేఎస్ఎస్ సభ్యులు, బూత్ కమిటీలు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. వేడుకలను వర్చువల్‌గా వీక్షించేందుకు ఆయా ప్రాంగణాల్లో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. పాల్గొనే కార్యకర్తలకు ప్రత్యేక భోజన సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు. మహానాడు వేడుక ప్రాంగణాలు పసుపుమయం కానున్నాయి. ఆయా ప్రాంతాల్లో పసుపు జెండాలు, తోరణాలతో అలంకరణలు చేపడుతున్నారు. తెలుగు తమ్ముళ్ల రాకతో వేడుక ప్రాంతాలు సందడిగా మారనున్నాయి. మార్టూరు మండల పరిధిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించే మహానాడు వేడుకలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



హాజరుకానున్నారు. మహానాడు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తుండగా, నియోజకవర్గ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మండలాల వారీగా ఏర్పాట్లు...మార్టూరు మండలం:క్లస్టర్-1, క్లస్టర్-2, క్లస్టర్-3 పరిధిలోని గ్రామాలకు సంబంధించిన మహానాడు వేడుకలు ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నారు. యద్దనపూడి మండలం:క్లస్టర్-4 పరిధిలో మహానాడు వేడుకలను యద్దనపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. పర్చూరు మండలం:క్లస్టర్-5 పరిధిలో నూతలపాడు గ్రామంలో, క్లస్టర్-6 పరిధిలో కొల్లావారి కళ్యాణ మండపంలో పర్చూరు మండలానికి చెందిన గ్రామాల కార్యకర్తలతో మహానాడు వేడుకలు జరగనున్నాయి. కారంచేడు మండలం:క్లస్టర్-7 కార్యక్రమాన్ని కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ కళ్యాణ మండపంలో, క్లస్టర్-8 కార్యక్రమాన్ని స్వర్ణ గ్రామ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఇంకొల్లు మండలం:క్లస్టర్-9 మహానాడు వేడుకలు ఇంకొల్లు లక్ష్మీ ప్రియాంక కళ్యాణ మండపంలో (మార్కెట్ యార్డు ఎదురుగా), క్లస్టర్-10 కార్యక్రమం ఇడుపులపాడు గ్రామంలో జరగనుంది. చిన్నగంజాం మండలం:క్లస్టర్-11 పరిధిలో చిన్నగంజాం వాసవి టెంపుల్ కళ్యాణ మండపంలో, క్లస్టర్-12 పరిధిలోని గ్రామాలకు పెద్దగంజాం గ్రామంలో మహానాడు వేడుకలు నిర్వహించనున్నారు.

# పిడుగుపాటు కాదు...యానాది యువకుడిది హత్యే

**పూనూరి కొండయ్య హత్య పై ఒంగోలు ఆర్డీవో, డిఎస్పిచే విచారణ జరిపించాలి**
**కలెక్టరేట్ వద్ద బాధితుల ఆందోళన**
**జిల్లా కలెక్టర్ రాజా బాబుకు దళిత నేత నీలం వినతి**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

పిడుగుపాటు మరణంగా పోలీసులు చెబుతున్న పూనూరు కొండయ్య అనే యానాది యువకుడిది హత్యే నని ఎస్టి కులానికి చెందిన కొండయ్య హత్యపై దర్శి డిఎస్పి చే విచారణ జరిపించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్, ఎస్సీ ఎస్టీ యాక్ట్ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ ను కలిసి పూనూరు కొండయ్య హత్యను మాఫీ చేసేందుకు పిడుగుపాటు ఖాకి కథల్లారని ఫోటో లు చూపించారు. కురిచేడు మండలం ఆవుల మంద గ్రామానికి చెందిన పూనూరు కొండయ్య కొత్త పట్టణం మండలం అల్లూరు గ్రామానికి చెందిన దేవర బోయిన ప్రసాద్ అను బీసీ కులానికి చెందిన భూస్వామి వద్ద ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. అతనికి నాలుగు సంవత్సరాల బాబు మూడు సంవత్సరాల పాప కలదు అన్నారు. ఈ నెల మూడో తేదీన ఉదయం ట్రాక్టర్ యజమాని దేవర బోయిన ప్రసాద్ వద్దకు యధావిధిగా పనికి వెళ్ళాడు అన్నారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో రాత్రి 10గంటలకు భార్య దుర్గా లక్ష్మి భర్త కి ఫోన్ చేసిందన్నారు. మా ఓనరు మేము కొంతమందిమి కలిసి పార్టీ చేసుకుంటున్నాం ఇంటికి వస్తాలే అని కొండయ్య సమాధానం చెప్పాడన్నారు. తర్వాత ఫోన్ ఎత్తుకోలేదు అంతటా యజమాని ప్రసాద్ కి ఫోన్ చేయగా నీ భర్త ఇంటికి వస్తాడులే అని ఫోన్ పెట్టేసాడు. కొండయ్య అత్తమామలు ఎన్నిసార్లు ఫోన్ చేసినా దేవర బోయిన ప్రసాదు ఫోను లిఫ్ట్ చేయలేదు. మరుసటి రోజు నాలుగవ తేదీ పూనూరు కొండయ్య మృతదేహం అల్లూరు నుండి కరవది వెళ్లే దారిలో జమ్మి చెట్టు కింద పడి ఉంది అతని భార్య దుర్గా లక్ష్మి బంధువులు వెళ్లి చూడగా కొండయ్య నోటి నుండి రక్తం కారుతూ, గొంతు దగ్గర కమిలి ఒంటినిండా బురదతో మృతదేహం కనిపించింది. కొండయ్య హత్యకు గురయ్యాడని బంధువులు చెప్పగా పోలీసు వారు పిడుగు పడి చనిపోయాడని చెప్పమని బంధువులను బెదిరించారు అని నీలం నాగేంద్ర అన్నారు. మేము చెప్పినట్టు వినకపోతే ప్రభుత్వం నుండి మీకు పైసా కూడా రానీయకుండా చేస్తామని ఒంగోలు తాలూకా పోలీస్ వారు బెదిరించారన్నారు. అమాయకులైన యానాదులను బెదిరించి సంతకాలు తీసుకున్నారన్నారు. సేవ పంచనామాలు కూడా మీ కులస్తులు చల్లరని ట్రాక్టర్ యజమాని దేవర బోయిన ప్రసాద్ బంధువులను సేవ పంచనామాలు పెద్దమనుషులుగా పెట్టారన్నారు. ఈ ఘటన 20042/26 బిఎన్ఎస్ సెక్షన్ 194 అనుమానాస్పద మరణంగా ఒంగోలు తాలూకా ఎస్ఐ ఫణిభూషణ్ కేసు నమోదు చేయించారన్నారు. రిమ్స్‌లో ప్రభుత్వ ఫోరెన్సిక్ వైద్యులు సుబ్బారావు చే తాలూకా పోలీసులు పోస్టుమార్టం చేయించారన్నారు. సింగరాయకొండలో సంచలనం సృష్టించిన ముస్లిం విద్యార్థి కౌశిక్ కేసులో కూడా పోస్టుమార్టం చేసింది పోలీసుల పక్షపాతి డాక్టర్ సుబ్బారావు అన్నారు. జిల్లా ఎస్పీ ద్వారా పూనూరు కొండయ్య హత్య కేసును దర్శి డిఎస్పి చే విచారణ జరిపించాలని అదేవిధంగా ఒంగోలు ఆర్టీవో చే ప్రత్యేక విచారణ జరిపించి కొండయ్య హంతక ముఠాను అరెస్టు చేయించాలని జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో కొండయ్య భార్య దుర్గ లక్ష్మి బంధువులు, డిబిఆర్సి ప్రతినిధి గుంటూరు నాగమణి, మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ పత్రా బంగారం, బొమ్మలు వంశీ, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, తదితరులు ఉన్నారు.

# భీమవరం4 అంగన్వాడి సెంటర్‌లో శారీరిక వ్యాయామం ప్రాముఖ్యత





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 26)

కిషోర్ వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమవరం 4 అంగన్వాడి సెంటర్ నందు శారీరిక వ్యాయామం ప్రాముఖ్యత అలానే క్రీడలు, ఆటలు, యోగ ప్రాముఖ్యత గురించి వివరించారు. క్రీడలు ఆటలు ముందుగా మన స్కూలు స్థాయి తర్వాత మండల స్థాయి జిల్లా స్థాయి అలానే స్టేట్ స్థాయి అలా ఎదుగుదల ఎలా ఉంటుంది, ఏంటి అనేది, ఏ ఆటలాడితే వాళ్లకి ఉపయోగకరంగా ఉంటుంది. అలానే యోగ ప్రాముఖ్యత గురించి కూడా వివరించామన్నారు. ముందు వ్యాయామం డ్రిల్ గురించి స్కూల్లో ఆటలు ఎలాలాంటీ ఆటలు ఆడితే మనం శారీరక వ్యాయామంగా పరిగణిస్తామన్నారు. కోకో, కబడ్డీ, వాలి బాల్, ఫుట్ బాల్ అవన్నీ కూడా తెలియజేశారు. దాంతో భాగంగా వచ్చిన బాలురుకి యోగ గురించి, మరి బాలికలందరికి కూడా మరల ఫోక్స చట్టం గురించి, అలానే రక్తహీనత గురించి పోషకాహారం గురించి తర్వాత వాళ్లకి చైల్డ్ మ్యారేజ్ గురించి కూడా వివరించడం జరిగింది. అందరూ అంగన్వాడి ఆయాలు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శైలజ తెరిసా, ప్రేమకుమారి హాజరయ్యారు.

# సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు పనుల పరిశీలన







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 26)

ఎస్సీ, ఎస్టీ రూఫ్‌టాప్ సోలార్ పథకం కింద ఒంగోలు రూరల్ సెక్షన్ పరిధిలోని త్రోవగుంట గ్రామంలో జరుగుతున్న సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు పనులను ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టీవీఎస్ఎన్ మూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని సమీక్షించి, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటును నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతంగా కొనసాగించాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశలో సాంకేతిక నిబంధనలు అమలు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com